2024 Happy New Year నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024 Happy New Year

క్లుప్తంగా

నేడు 'అక్షింతల' వితరణ

హన్మకొండ కల్చరల్: అయోధ్య శ్రీరాముల వారి ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరాముడి పూజిత అక్షింతలు నగరంలోని ప్రతి ఇంటికి వితరణ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని విశ్వహిందూ పరిషత్ వరంగల్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు వరంగల్ పోచమ్మమైదాన్ పోచమ్మగుడి వద్ద విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ కార్యక్రమ సభ్యులు యక్కలి రాఘవులు ముఖ్యఅతిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు అయ్యప్పకు విశేష పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మ శాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో అయ్యప్పస్వామికి సోమవారం విశేష పూజలు, భక్తులకు మహా అన్నప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గణపతిశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమంలో భాగంగా సేవాశ్రమం నిర్వాహకులు టీఆర్.బాలసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

రేపు శ్వేతార్కలో చిత్రాన్నపూజ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం సహస్రాధిక రుచికర చిత్రాన్నపూజ (పులిహోరతో) నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో 22 ఏళ్లుగా జనవరి నెల మొదటి మంగళవారం శ్వేతార్క ఆలయంలో చిత్రన్నపూజ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

'చాంబర్' డైరీ ఆవిష్కరణ



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన సంవత్సర -2024 డైరీని వరంగల్‌కు చెందిన ఉమ్మడి రాష్ట్ర ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ చిదర ఓంకారేశ్వర్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, దుగ్యాల గోపాల్‌రావు, గోరంటల యాదగిరి, ఛాంబర్ అనుబంధ సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాలకు నూతన సంవత్సర శోభ



వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరుడు, భద్రకాళి అమ్మవారు, ఎక్సైకాలనీ వేంకటేశ్వరాలయంలో..

హన్మకొండ కల్చరల్: కొత్త సంవత్సరానికి ప్రారంభ రోజుగా ప్రతిఏటా జనవరి1న నగరంలోని దేవాలయాలను వేలాదిమంది భక్తులు సందర్శించి పూజలు నిర్వహిస్తున్నారు. కొత్త ఆంగ్ల సంవత్సరాది అయినప్పటికీ కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ దేశమంతటా పండుగలా జరుపుకుంటారు. నగరంలోని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి దేవాలయాలను ప్రతీయేడు వేలాది మంది భక్తులు సందర్శించి పూజలు నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని అదాలత్ వెనుకగల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, రెడ్డి కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో, సుబేదారి రెవెన్యూకాలనీలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో, కాజీపేట సిద్ధార్థ నగర్ ప్రసన్నాంజనేయ దేవాలయంలో, సాయిబాబా మందిరాల్లో, కరీమాబాద్ బొమ్మల గుడి దేవాలయంలో, వరంగల్ బట్టలబజార్‌లోని బాలా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, రాజరాజేశ్వరి దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. గతంలో కొన్ని దేవాలయాల్లో అర్ధరాత్రి 12గంటలకు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించేవారు. ఐదేళ్ల క్రితం దేవాదాయశాఖ నూతన సంవత్సరం క్యాలెండర్ మారేరోజుగా నిర్ణయించి అర్ధరాత్రి వరకు దేవాలయాల్లో పూజలు నిర్వహించకూడదనే జీఓను విడుదల చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి 9గంటల వరకు దేవాలయాల్లో మహాహారతి నిర్వహించి మూసివేస్తున్నారు. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ వేంకటేశ్వరాలయంలో సోమవారం ఉదయం శ్రీరామ పూజిత అక్షింతల వితరణలో భాగంగా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు అర్చకుడు అనంత శేషరాజన్ తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కాజీపేట రూరల్: శారీరక దృఢత్వం, ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో దోహదపడుతుందని స్వాడ్స్ కాయ్ షాటోకాన్ కరాటే అకాడమీ ఇండియా ఫౌండర్ అండ్ ఎగ్జామినర్ మాస్టర్ నాయిని సదానందం సూచించారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ మీటింగ్ హాల్‌లో విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ టెస్ట్, బెల్టులను ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కరాటే నేర్చుకోవడం తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు. అనంతరం, సదానందం జె.పురవ్‌తేజ్, ఎస్.త్రిలోక్‌కు బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్, పి.కాశిక్, ఎం.వైభవ్, సీహెచ్.దీపక్‌సాయికి బ్లాక్‌బెల్ట్ సెకండ్ డాన్ ప్రదానం చేశారు.

'కాఫీ విత్ గవర్నర్'

హసన్‌పర్తి: వాసవి క్లబ్, హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఆదివారం 'కాఫీ విత్ గవర్నర్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వాసవి క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గంపా సాంబమూర్తిని ఆహ్వానించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాంబమూర్తి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్ రాజిరెడ్డికి సన్మానం



ప్రొఫెసర్ రాజిరెడ్డిని సన్మానిస్తున్న గోపాల్‌రెడ్డి, పాపిరెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్ కే.రాజిరెడ్డిని కళాశాల సెమినార్ హాల్‌లో పరిశోధకులు ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ రాజిరెడ్డి అందించిన విద్యాపరమైన, పరిశోధనల పరంగా అందించిన సేవలను కొనియాడారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బీఓఎస్‌గా, డీన్‌గా, ఐసెట్ కన్వీనర్‌గా ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు నరసింహామూర్తి, కృష్ణమాచారి, ఇంద్రసేనారెడ్డి, పరిశోధకులు డాక్టర్ శంకర్, డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ వడ్డెపెల్లి మధు, డాక్టర్ అశోక్, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ హరిణి, వంశీ, కాంట్రాక్టు అధ్యాపకులు, పార్ట్‌టైం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాజిరెడ్డిని అతిథులు, పరిశోధకులు సన్మానించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్

ఖిలా వరంగల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. రౌడీషీటర్లు సెటిల్‌మెంట్లు, గొడవలు, బెదిరింపులకు పాల్పడితే, భూ దందాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, రాజు, పున్నంచందర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై కేంద్ర మంత్రి పూజలు



పూజలు చేస్తున్న మంత్రి బీఎల్.వర్మ, తదితరులు

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి సహాయక మంత్రి బీఎల్.వర్మ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్ర, ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ భూమిలో నిర్మిస్తున్న రైల్వే పీరియాడికల్ వర్క్ షాప్‌నకు కేటాయించిన స్థలాన్ని గుట్టపై నుంచి పరిశీలించారు. మంత్రి వెంట బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మంత్రి గుండె విజయరామారావు, నాయకులు ఉమారాణి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అజర'లో నేటి నుంచి వైద్య శిబిరం



అజర ఆస్పత్రి

ఎంజీఎం: అజర ఆస్పత్రిలో జనవరి 1నుంచి 31వ తేదీ వరకు ప్రివెంట్ హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. 54శాతం ప్రత్యేక తగ్గింపుతో బాడీ చెకప్ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రూ.17,420 విలువ గల వైద్య పరీక్షలను రూ.7,999లకే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య ప్యాకేజీలను ఆన్‌లైన్ బుక్‌చేసుకున్న వారికి అదనంగా రూ.500 తగ్గింపు ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 93910 09701, 93910 09702 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

19వ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆదివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని సీతారామస్వామి ఆలయంలో కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలని, భగత్‌సింగ్‌నగర్‌లో పట్టాలు, పోచమ్మగుడి అభివృద్ధి, ఎరుకల వాడలోని బతుకమ్మ చెరువును పరిరక్షించి చుట్టూ హద్దులు నిర్ధారించాలని సొసైటీ కాలనీలోని శ్మశాన వాటికను కబ్జా దారుల నుంచి కాపాడి ప్రహరీ, వివేకానందకాలనీలోని ఎరుకల వాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పోచమ్మగుడి అభివృద్ధితో పాటు డివిజన్‌లోని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న తిరుపతిరెడ్డి, బాధ్యులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని టేకులగూడెం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బొమ్మినేని సుధాకర్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. పీఆర్‌టీయూ క్రియాశీలక సభ్యుడైన సుధాకర్‌రెడ్డి కుటుంబానికి హనుమకొండలో పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, బాధ్యులు పీఆర్‌టీయూ తరపున రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ కాజీపేట మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొమ్మ వీరయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు బీరం సంధ్యారాణి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌గఫార్, బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, బొబ్బాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి: జాతీయ స్థాయి తంగ్ – తా మార్షల్ ఆర్ట్స్‌కు ఎంపికైన వంగపహాడ్ పాఠశాలకు చెందిన పి.హర్షిత, ఎస్.అక్షితకు మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్ ఆర్థిక సాయం చేశారు. జనవరి 11నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఇరువురు క్రీడాకారిణులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు పాల్గొన్నారు.

గౌరవ వేతనం అమలయ్యేలా చూడండి



సీతక్కను సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం త్వరగా అమలయ్యేలా చూడాలని డీలర్ల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్‌బాబు, జన్ను రవి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను ఆదివారం సన్మానించారు. మోహన్, రమేష్, బత్తుల మహేష్, విజయపాల్, ఆర్.సంధ్యారెడ్డి, భాస్కర్, సునిల్, సతీష్, రాజ్‌కుమార్, కమలాకర్ పాల్గొన్నారు.

పేదలకు చేయూతనందించాలి



శివప్రసాద్‌రెడ్డిని సనానిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: రిటైర్డ్ పోలీసు అధికారులు అనాథ వృద్ధులు, పేద పిల్లలకు చేయూతనందించాలని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. టీఎస్ఎస్పీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ – ఖమ్మం రోడ్డులో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ అంబాల ఉదయ్‌కిరణ్, అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి అధ్యక్షతన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం కోశాధికారి కత్తి సమ్మయ్య ఆర్థిక నివేదికను సభ్యుల ముందు ప్రవేశపెట్టగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. రిటైర్డ్ అధికారులు ఎం.లక్ష్మయ్య, సీహెచ్.సత్తయ్య, కత్తి సమయ్య, ఎంఏ.ఖాదర్, నూరొద్దీన్, జయేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ.సర్వర్, సయ్యద్‌ఖాజా, జయదేవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పీ.చంద్రయ్య, కుమారస్వామి, విజేందర్‌రెడ్డి, ముర్గన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అన్నిదానాల్లో నేత్రదానం గొప్పది

కాశిబుగ్గ: అన్నిదానాల్లో నేత్రదానం గొప్పదని తెలంగాణ రాష్ట్ర బ్లడ్, ఆర్గాన్ డోనర్స్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొంతం కృష్ణ అన్నారు. కాశిబుగ్గలో సొసైటీ కార్యదర్శి ఆడెపు రమేష్ నాయనమ్మ ఆడెపు లక్ష్మీ నర్సమ్మ ఆదివారం మృతి చెందారు. మృతురాలి కళ్లను ప్రభుత్వ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆమె కళ్లను ఆస్పత్రికి చెందిన టెక్నీషియన్ నరేందర్ సేకరించారు.

వెంకన్న ఆలయానికి వెండిపూల బహూకరణ

కాజీపేట: తమ కుమారుడు మహిత్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి బండారు సంగీత, మన్మోహన్ దంపతులు వెండిపూలను ఆదివారం బహూకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పంజాల అశోక్ కుమార్‌గౌడ్‌కు వెండిపూలను దాతలు అందించారు.

ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించండి

హన్మకొండ: వరంగల్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌ను రవి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

హసన్‌పర్తి: దివ్యాంగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గొల్లె రాజయ్యను సన్మానించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో భారత జాగృతి (యూకే)అధ్యక్షుడు బల్మూరి సుమన్‌రావు, దివ్యాంగుల వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు వలీ పాల్గొన్నారు.

కిడ్నీకేర్ సెంటర్ ప్రారంభం

హన్మకొండ అర్బన్: నగరంలోని బాలసముద్రంలోని ఫైర్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అంజలి కిడ్నీకేర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి, నరేష్, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ ఎంపీ ఆనంద్‌కుమార్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ వేణు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

న్యూశాయంపేట: ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను హనుమకొండ సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు కేక్ కట్ చేసి మాట్లాడారు. నూతన సంవత్సరంలో పార్టీ విస్తరణకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కర్రె భిక్షపతి, తోట భిక్షపతి, ఎల్లేశ్, రవి, దీన, రాజమణి, రాజేందర్, దేవ, రాజ్‌కుమార్, పూర్ణచందర్, శివకుమార్, వినయ్, సందీప్, రానా పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేటలో శ్రీహరిహర పుత్ర భక్త మండలి ఆధ్వర్యంలో 32వ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.